క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. దీనిపై సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించారని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మరి బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఆశీర్వాదం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.జయశ్రీ, వీవీ శ్రీనివాసరావు, లలిత, గిరిబాబు పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

సీటీఆర్ఐ: విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన ఆర్వీ ప్రసన్నకుమారి సంగీత కళాకారులకు అందించిన సేవలు చిరస్మరణీయమని స్థానిక విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ మండా కృష్ణమోహన్ కొనియాడారు. శనివారం స్థానిక విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆమె సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో 2012 నుంచి 2021 వరకూ తొమ్మిదేళ్ల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ప్రగతి పథాన పయనించాలని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని రుడా కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుటుంబంతో పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంటూ ప్రగతి బాట పయనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రుడా అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గజవాహన సేవ

కడియం: స్థానిక జనార్దన స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామిని గజవాహనంపై ఊరేగించారు. ఆలయంలో నిత్య హోమంతో పాటు బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు వేదాంతం జగన్నాథాచార్యులు, చక్రపాణిల పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

వైభవంగా నగరేశ్వరుని కల్యాణం

కడియం: జేగురుపాడులోని ఉమా నగరేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దెందులూరి సూరిబాబు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. స్వామివారికి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ పట్టువస్త్రాలను సమర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ధర్మకర్తల మండలి చైర్మన్ నిచ్చెనకోళ్ల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సోమాలమ్మకు లక్ష పుష్పార్చన

సీటీఆర్ఐ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న పాత సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు రెండో రోజు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు అమ్మవారికి లక్ష పుష్పార్చన జరిగింది. సాయంత్రం 6 గంటలకు సహస్ర జ్యోతిర్లింగార్చన చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సత్యశ్రావణి నృత్యకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదాయం ఇంతింతై

- ఇంట్లోనే సేంద్రియ ఎరువుల తయారీ
- ఉపాధి పొందుతున్న మహిళలు
- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ



నారాయణపురంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కూరగాయల విక్రయం

సీటీఆర్ఐ: వ్యర్థానికీ అర్థం దొరికింది.. ఆదాయం 'ఇంతి'ంతవుతోంది.. చెత్త సంపదను సృష్టిస్తోంది.. మహిళ ఆదాయ మార్గాల వైపు అడుగులు వేస్తోంది.. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అధికారులు అందిస్తున్న సహకారం వారికి తోడ్పాటుగా నిలుస్తోంది.. వ్యాపారం చేయాలంటే కొంత పెట్టుబడి అవసరం ఉంటోంది. తీరా పెట్టుబడి పెట్టినా ఆ డబ్బు తిరిగి వస్తుందన్న నమ్మకం ఉండదు. అందుకే ఇంటి ఆవరణలోనే కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని సొంతానికి వినియోగించుకుని, మిగిలినవి ఇతరులకు విక్రయించే పద్ధతిని చాలామంది అవలంబిస్తున్నారు. కూరగాయలు పండించడానికి అవసరమయ్యే ఎరువులకు కాస్త ఖర్చు అవుతుంది. అయితే ఖర్చులేని సేంద్రియ ఎరువుల తయారీపై స్థానిక నగరపాలక సంస్థ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంట్లో వ్యర్థ పదార్థాల ద్వారా ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులు తయారు చేసుకోనే విధంగా మహిళలకు శిక్షణ తరగతుల్లో తెలియజేస్తున్నారు. గత ఏడాది ప్రారంభమైన ఈ తరగతుల్లో ఇప్పటి వరకూ 5 వేల మంది వరకూ సేంద్రియ వ్యవసాయం, ఎరువుల తయారీపై శిక్షణ అందించారు. ఇలా శిక్షణ పొందిన వారు ఇంటి వద్దే సేంద్రియ ఎరువులు తయారు చేసి కొంత కార్పొరేషన్‌కు కూడా విక్రయిస్తున్నారు. పండించిన కూరగాయలను స్థానిక నారాయణపురంలోని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నదుకాణంలో అమ్ముతున్నారు. ఇక్కడ మహిళలు తెచ్చిన కూరగాయలతో పాటు అక్కడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పండించిన కూరగాయల అమ్మకాలు సాగిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో వీటిని పండించడంతో డిమాండ్ అధికంగా ఉంటోంది.

ఇంట్లోనే సొంతంగా..

సొంతంగా తయారు చేసుకున్న సేంద్రియ ఎరువులతో పెరటి మొక్కల పెంపకంపై నగరంలో అనేక మంది ఆసక్తి చూపుతున్నారు. ఇంట్లో ఏ మాత్రం ఖాళీ ప్రదేశం కనిపించినా అక్కడ మొక్కలు నాటుతున్నారు. అంతేకాకుండా గార్డెనింగ్, డాబాపై పూల, కూరగాయల మొక్కలు వంటివి సొంతంగా పండిస్తున్నారు. ఇంట్లో మిగిలిన వ్యర్థాలతో తయారు చేసిన కంపోస్టును మహిళలు తమ ఇంటి పరిసరాల్లో వేసిన మొక్కలకు వేస్తున్నారు. దీనివల్ల దిగుబడి పెరుగుతుంది. సేంద్రియ ఉత్పత్తులు కావడంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. తయారీ చేసుకునే విధానం కూడా చాలా సులవుగా ఉండటంతో అతివలు ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. దీనివల్ల ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. కుటుంబానికి కొంత ఆసరాగా నిలుస్తున్నారు.

తయారీ విధానం ఇలా..

కూరగాయల వ్యర్థాలు, మిగిలిన అన్నం, తడి చెత్తను ఒక కుండలో కాని, బిన్‌లో వేసుకోవాలి. కుండీకి/బిన్‌కి అడుగున ఒక రంధ్రం చేయాలి. దీనిద్వారా చెత్తలోని తేమ బయటకు పోతుంది. ఇలా రోజూ ఇంట్లో మిగిలిన తడి చెత్తను వాటిలో వేసుకోవాలి. దాని చుట్టూ కారం, పసుపు చల్లాలి. దీనివల్ల చీమలు పట్టకుండా ఉంటాయి. నెల రోజుల్లోనే కంపోస్ట్ తయారవుతుంది. ఈ విధానంపై ఇప్పటికే మహిళలకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.



తాను తయారు చేసిన సేంద్రియ ఎరువును నగరపాలక సిబ్బందికి విక్రయిస్తున్న మహిళ

మెరుగైన వైద్య సేవల దిశగా 'డెల్టా'

- ట్రామా, యాక్సిడెంట్ కేర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజా



ట్రామా కేర్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, ప్రజల విలువైన ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు కృషి చేయాలని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక వెంకటేశ్వరనగర్ హైవే సమీపంలోని డెల్టా ఆసుపత్రిలో ట్రామా అండ్ యాక్సిడెంట్ కేర్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెల్టా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ భాస్కర్‌చౌదరి ఎన్నో కీలకమైన ఆపరేషన్లు, వైద్య సేవలందించి ఉభయగోదావరి జిల్లాల్లో వేల మంది ప్రాణాలు కాపాడారన్నారు. హైవేకు సమీపంలో ట్రామా కేర్ ఉండడం వల్ల ప్రమాదాలకు గురైన వారిని ఆసుపత్రికి తీసుకువచ్చి త్వరితగతిన వైద్య చికిత్సలు అందించే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ ఆర్.భాస్కర్‌చౌదరి మాట్లాడుతూ రోగులు ఇబ్బందులు పడకుండా ఒకే ఆసుపత్రిలో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నిపుణులైన వైద్యులు ఆయా విభాగాల్లో సేవలందిస్తారన్నారు. ఆసుపత్రి వైద్యులు చీఫ్ కార్డియాలజిస్ట్ బొమ్మిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్ ఆర్.నితిన్, వైద్య బృందం పాల్గొన్నారు.

ఎల్ఐసీ దివాళాకు కేంద్ర ప్రభుత్వం కుట్ర



సభలో మాట్లాడుతున్న వేణుగోపాల్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎల్ఐసీని దివాళా తీయించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆ సంస్థ ఉద్యోగుల సంఘ ఆలిండియా పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక సూర్యగార్డెన్స్‌లో శనివారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ 26వ మహాసభ నాయకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షతన మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ అదాని ఇండెన్‌బర్గ్ రిపోర్టు నేపథ్యంలో దేశమంతా ఎల్ఐసీపై దృష్టి సారించిందన్నారు. అదాని షేర్లు పతనం కావడం ద్వారా ఎల్ఐసీ పెట్టిన షేర్లు పతనం అయ్యాయనే ఆందోళన ప్రజల్లో ఉందన్నారు. అయితే ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదని ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, కొన్ని రాజకీయ పార్టీలు దీనిని ఆధారంగా చేసుకుని ఎల్ఐసీని దివాళా తీయించేలా కుట్రలు సాగిస్తున్నాయన్నారు. సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు పి.సతీష్, అఖిల భారత ఉద్యోగుల సంఘం కోశాధికారి బీఎస్ రవి, జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, సౌత్ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షుడు కిశోర్‌కుమార్, తెలంగాణ మహిళా కన్వీనర్ మైథిలి, రాజా సింగ్, శ్రీనివాసన్, ఎంఏఎఫ్ బెనర్జీ తదితరులు మాట్లాడారు.

బెనర్జీ సేవలు అభినందనీయం

ఎల్ఐసీ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు ఎంప్లాయిస్ యూనియన్ నగర డివిజన్ అధ్యక్షుడిగా ఎంఏఎఫ్ బెనర్జీ అనేక పోరాటాలు చేశారని ఆలిండియా జీవిత బీమా ఉద్యోగుల సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ అన్నారు. బెనర్జీ ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన మాట్లాడారు. బెనర్జీని తుమ్మిడి బ్రదర్స్ పక్షాన తుమ్మిడి బాబ్జి శాలువాలతో సత్కరించారు.

పడితే అంతే..



మ్యాన్‌హోల్‌కు అడ్డుగా పెట్టిన చెత్త కుండీ

రాజమహేంద్రవరం రూరల్: అటుగా వెళ్తే కాస్త చూసి వెళ్లాల్సిందే.. లేకుంటే ప్రమాదం బారిన పడక తప్పదు. రూరల్‌లోని శాటిలైట్‌సిటీ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధాన సెంటర్ నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో పరిస్థితి ఇది. డ్రైనేజీపై మ్యాన్ హోల్స్ ప్రమాదకరంగా మారాయి. వీటిపై ఉన్న ఇనుప చక్రాలు పాడవడంతో తాత్కాలికంగా చెత్త కుండీని, కర్రను బోటుగా పెట్టారు. దీని వల్ల కొంత ఉపశమనం ఉన్నప్పటికీ రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనచోదకులు ఆందోళన చెందుతురు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై రక్షణ ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రకాశంనగర్: స్థానిక ఎన్జీవో కార్యాలయం వద్ద మహిళా ఎన్జీవోల నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. సంఘ చైర్‌పర్సన్‌గా వి.కామేశ్వరి, కో చైర్‌పర్సన్‌గా కె.వసుధ, వైస్ చైర్‌పర్సన్లుగా నాగలక్ష్మి, కె.సుబ్రహ్మణ్యేశ్వరి, ఎస్.నళినీకుమారి, కన్వీనర్‌గా హీమాగౌరి, జాయింట్ కన్వీనర్లుగా హేమలతాదేవి, భానుశ్రీ, కిరణ్మయి, జి.శ్యామల, కోశాధికారిగా శేషశ్యామల ఎన్నికయ్యారు.

వచ్చే నెల 2న రచయితల మహాసభ

ప్రకాశంనగర్: జిల్లా అభ్యుదయ రచయితల సంఘం మహాసభ ఏప్రిల్ 2న నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున సాగర్ తెలిపారు. శనివారం స్థానిక గోరక్షణ పేటలోని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యాలయంలో సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల వీరభద్రరావు అధ్యక్షతన సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జిల్లా రచయితల సంఘం మహాసభ జరపాలని తీర్మానించినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ముప్పన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభితం.. నారసింహుని క్షేత్రం



నారసింహస్వామికి గరుడ వాహనోత్సవం

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం మూడో రోజు ప్రత్యేక పూజలు జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 9 గంటలకు అన్నవరం సత్యనారాయణ దేవస్థానం ఆధ్వర్యంలో స్వామికి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి మాఢవీధుల నుంచి తిరుగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలాఉంటే ఉదయం ఆరాధన, సర్వదర్శనం, గ్రామ బలిహరణ, సేవాకాలం, తీర్థప్రసాద గోష్టి జరిగింది. రాత్రి 8 గంటలకు గ్రామ బలిహరణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా కోరుకొండ భక్తులతో కిక్కిరిసింది. కొండపైకెక్కిన భక్తులు స్వామిని దర్శించుకుని తన్మయం చెందారు. దేవుని కోనేటిలో

గరుడ వాహనంపై ఊరేగిన స్వామివారు

స్నానమాచరించిన భక్తులు కొండపైకి ఎక్కి మొక్కులు తీర్చుకున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పంచాయతీ రాజ్, మండల పరిషత్ శాఖలకు చెందిన అధికారులు పురవీధుల్లో పారిశుద్ధ్యంపై దృష్టిసారించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మండపంలో రాజమహేంద్రవరానికి చెందిన వైక్షీరసాగరిక భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ ఎస్వీ రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థానం ట్రస్టు సభ్యులు తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ఏసీ రమేష్‌బాబు, పి.వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో వైష్ణవ మహిళ మృతి చెందడంతో దర్శనాలను రెండు గంటలపాటు నిలిపివేశారు.

నేడు సదస్యం

నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం సదస్యం జరుగుతుంది. స్వామివారి ఆలయ ముఖ మండపంలో వేదపండితులు, ఉభయ వేదాంత పండితుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు ఆంజనేయ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఉంటుంది.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న పతంజలి డీజీఎం రమణ

రాజానగరం: తోకాడలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు సర్పంచ్ చక్రధరరావు అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఉద్యాన శాఖ, పతంజలి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు ఏవిధంగా సాధించవచ్చో వివరించారు. డ్రిప్ ఇరిగేషన్‌తో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో పతంజలి డీజీఎం రమణ, వీహెచ్ఏలు ప్రసన్న, జ్యోతి, క్లస్టర్ ఇన్‌చార్జి, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

మధురపూడి: దేశంలో మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కోరుకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు మండల, జిల్లా స్థాయిలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి, న్యాయపరమైన సలహాలను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీవీఎస్ కుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.మానస, డీఆర్‌డీఏ ఏపీడీ ఇ.శ్యామసుందర్, ప్యానల్ అడ్వకేట్ డి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న సత్యనారాయణ

సీతానగరం: మండలంలోని రాపాక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం చినకొండేపూడి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ తన బైక్‌పై రాజమహేంద్రవరం వెళ్తుండగా, రాపాక రైస్‌మిల్లు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. అతని తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మరో బైక్‌పై ఉన్న సీతానగరం పంచాయతీ పరిధి వెలమపేటకు చెందిన వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



దర్శన్ సైన్స్ ఎక్స్‌పోను ప్రారంభించిన సుగుణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక శంభూనగర్‌లోని శ్రీహర్షవర్ధన ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో శనివారం విద్యాసంస్థల ఫౌండర్, చైర్మన్ దేశెట్టి కేశవ హరిప్రసాద్ ఆధ్వర్యంలో దర్శన్ సైన్స్ ఎక్స్‌పో 2023ను నిర్వహించారు. తొలుత ఈ ప్రదర్శనను విద్యాసంస్థల ఎకడమిక్ డైరెక్టర్ దేశెట్టి సుగుణ ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులు తాము తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని పలువురు తిలకించి అభినందించారు.

ఒకే షిఫ్ట్‌గా వ్యవసాయ విద్యుత్

కడియం: మండలంలో వ్యవసాయ విద్యుత్‌ను ఒకే షిఫ్ట్‌లో ఇచ్చే విధంగా ఆ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వేసవిలో తెల్లవారు జామున ఒక షిఫ్ట్, ఉదయం 11 గంటల నుంచి మరో షిఫ్ట్‌గా ఇచ్చేలా ఇటీవల మార్పు చేశారు. అయితే షిఫ్ట్‌లు కడియం ప్రాంతంలో విస్తరించి ఉన్న నర్సరీ రైతులకు తీవ్ర ఇబ్బందికరమని ఇటీవల నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) ఆధ్వర్యంలో సభ్యులు వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కూలీలున్న సమయంలో విద్యుత్ సరఫరా లేకపోతే మొక్కలకు పూర్తిగా నీరు అందించలేకపోతున్నామని వివరించారు. సంబంధిత ఉన్నతాధికారులతో చందన మాట్లాడి ఈ సమస్యను తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ వ్యవసాయ విద్యుత్‌ను అందించేందుకు అంగీకరించారు. నర్సరీ రైతుల సమస్య తీరిందని అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా చంటియ్య హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్య చెప్పిన వెంటనే పరిష్కారానికి కృషి చేసిన చందనకు కృతజ్ఞతలు తెలిపారు.

మోటారు సైకిల్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన మోటారు సైకిల్ చోరీకి గురైందని స్థానిక వీరభద్రనగర్‌కు చెందిన వాసంశెట్టి గనిరాజు (బాబ్జి) శనివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండపేటకు చెందిన గనిరాజు బొల్లినేని హాస్పిటల్‌లో పనిచేస్తూ వీరభద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 2న రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ ఉదయం లేచి చూసేసరికి కనిపించ లేదని, గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడని బాబ్జి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు సాయం

సీటీఆర్: జిల్లాలో ఇటీవల పలు ప్రమాదాల్లో ఏడుగురు జనసేన కార్యకర్తలు మృతి చెందగా, ఆయా కుటుంబాలకు పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సాయం అందించారు. శనివారం స్థానిక ఆనం రోటరీ హాలులో జరిగిన కార్యక్రమంలో పార్టీ తరఫున రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ఆయన అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నాయకులు పంతం నానాజీ, మేడా గురుదత్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	బలగం
సూర్యమినీ	అమిగోస్
సూర్యప్యాలెస్	ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు
స్వామి	వాల్తేరు వీరయ్య
అశోక	సార్
అనుశ్రీ	గ్యాంగ్ లీడర్
రాజా	సార్
ఊర్వశి	గ్రంథాలయం, సాచి
రంభ	రిచిగోడి పెళ్లి, ఇవేకాక
మేనక	వీరసింహారెడ్డి
గీతాఅప్సర	వినరో భాగ్యము విష్ణుకథ
నామవరం	
వీఎస్ మహల్	సార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	సార్